నేడు లోక్‌సభ ముందుకు
వక్ఫ్ జేపీసీ నివేదిక

న్యూఢిల్లీ: కేంద్రం తీసుకొచ్చిన 'వక్ఫ్ సవరణ బిల్లు-2024'పై సంయుక్త పార్లమెంటరీ కమిటీ (జేపీసీ) నివేదిక సోమవారం లోక్‌సభ ముందుకు రాబోతున్నది. జేపీసీకి చైర్మన్‌గా వ్యవహరించిన జగదంబికా పాల్, బీజేపీ ఎంపీ సంజయ్ తదితరులు ముసాయిదా బిల్లుపై తమ నివేదికను హిందీ, ఇంగ్లీష్ భాషల్లో పార్లమెంట్‌కు సమర్పించనున్నారు. జేపీసీ ముందు ఇచ్చిన సాక్ష్యాల రికార్డ్‌ను కూడా సభలో వారు ప్రవేశపెట్టబోతున్నారు. జనవరి 29న ముసాయిదా నివేదికను కమిటీ ఆమోదించింది. దీంట్లో ముసాయిదా బిల్లుకు కొన్ని సవరణలు ప్రతిపాదించినట్టు చైర్మన్ జగదంబికా పాల్ చెప్పారు. ముసాయిదా బిల్లులోని 14 క్లాజులకు సభ్యులు సవరణలు సూచించారని తెలిపారు. మెజార్టీ ఓటుతో వీటికి ఆమోదం తెలిపినట్టు చెప్పారు. కమిటీలోని విపక్ష సభ్యులు కేంద్రం తీసుకొచ్చిన వక్ఫ్ సవరణ బిల్లుపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు.

రాందేవ్‌పై అరెస్ట్ వారంట్

తిరువనంతపురం: ఓ క్రిమినల్ కేసులో కోర్టుకు గైర్హాజరైనందుకు పతంజలి ఆయుర్వేద కంపెనీ సహ వ్యవస్థాపకులు బాబా రాందేవ్, ఆచార్య బాలకృష్ణకు కేరళ కోర్టు నాన్ బెయిలబుల్ అరెస్టు వారంట్ జారీ చేసింది. ప్రజలను తప్పుదారి పట్టించే విధంగా ప్రకటనలు జారీ చేశారని ఆరోపిస్తూ పతంజలి ఆయుర్వేదకు చెందిన దివ్య ఫార్మసీపై కేరళ డ్రగ్స్ ఇన్‌స్పెక్టర్ కేసు దాఖలు చేశారు. ఫిబ్రవరి 1న బాబా రాందేవ్, ఆచార్య బాలకృష్ణ కోర్టుకు హాజరు కావాలని పాలక్కాడ్ జిల్లా కోర్టు ఇదివరకు ఆదేశాలు జారీచేసింది. అయితే వారిద్దరూ కోర్టుకు హాజరు కాకపోవడంతో ఫిబ్రవరి 15న వారిని హాజరుపరచాలని కోర్టు ఆదేశించింది.

పనితీరు మెరుగుపడని
ఉద్యోగులపై మైక్రోసాఫ్ట్ వేటు
ప్రయోజనాలు చెల్లించకుండానే తొలగింపు!

వాషింగ్టన్: పనితీరు సరిగాలేదన్న కారణంతో వేలాది మంది ఉద్యోగులను మైక్రోసాఫ్ట్ విధుల నుంచి తొలగించింది. ఇందులో చాలా మందిని వెంటనే డిస్మిస్ చేసినట్టు వార్తా కథనాలు వెలువడ్డాయి. అంతేగాక ఎలాంటి పరిహారం లేదా ప్రయోజనాలు కల్పించకుండా ఉద్యోగాల తొలగింపును సంస్థ చేపట్టినట్టు తెలిసింది. దీనిపై 'బిజినెస్ ఇన్‌సైడర్' కథనం ప్రకారం, పనితీరు విషయంలో కంపెనీ నిర్దేశిత ప్రమాణాలు అందుకోని వాళ్లను ఉద్యోగాల నుంచి పూర్తిగా తొలగిస్తూ మైక్రోసాఫ్ట్ 'టెర్మినేషన్ లెటర్స్' పంపింది. తొలగింపు వెంటనే అమల్లోకి వచ్చినట్టు ఆ లేఖల్లో పేర్కొన్నది. సంస్థ ఇచ్చిన ఐడీ కార్డులు, కార్పొరేట్ క్రెడిట్ కార్డులు, సంస్థ నుంచి తీసుకున్న హార్డ్‌వేర్, సాఫ్ట్‌వేర్‌లను తిరిగి ఇచ్చేయాలని లేఖల్లో ఆదేశించింది. అలాగే ఆఫీస్ భవనంలోకి ప్రవేశాన్ని నిషేధిస్తూ, ఆఫీస్ కంప్యూటర్లు, ఖాతాలు వినియోగించుకోకుండా చర్యలు తీసుకుంది. ఆఫీసులో చివరి రోజుతోనే హెల్త్‌కేర్, ప్రిస్క్రిప్షన్, డెంటల్ ప్రయోజనాలు నిలిచిపోయాయని ఉద్యోగులకు మైక్రోసాఫ్ట్ తెలిపింది. టెర్మినేషన్ లెటర్ అందిన రోజు నుంచి ఇది అమల్లోకి వస్తుందని తెలిపింది.

'చోలీకే పీచే' పాటకు డ్యాన్స్.. పెండ్లి రద్దు!

న్యూఢిల్లీ: మరి కాసేపట్లో పెండ్లి పీటలు ఎక్కాల్సిన వరుడు స్నేహితుల అభ్యర్థన మేరకు ఓ సినిమా పాటకు కాలు కదిపి పెండ్లిని కాలదన్నుకున్నాడు! ప్రత్యక్ష సాక్షుల కథనం ప్రకారం.. గత నెల 18న ఢిల్లీలో పెండ్లి వేడుకలో స్నేహితుల అభ్యర్థన మేరకు వరుడు 'చోలీకే పీచే క్యా హై' హిందీ సినిమా పాటకు కాసేపు సరదాగా డ్యాన్స్ చేశారు. అయితే వరుడి ప్రవర్తన తమ కుటుంబ విలువలను అవమానించేలా ఉందని వధువు తండ్రి కోప్పడ్డారు. వెంటనే పెండ్లి రద్దు చేసుకుంటున్నట్టు ప్రకటించారు. దీంతో కన్నీళ్ల పర్యంతమైన వధువు తన తండ్రికి సర్ది చెప్పేందుకు ప్రయత్నించి విఫలమైంది.

వెనుకబడిన రాష్ట్రంగా ప్రకటిస్తే అధిక నిధులు
కేరళ పై కేంద్ర మంత్రి వివాదాస్పద వ్యాఖ్యలు

న్యూఢిల్లీ: బడ్జెట్‌లో కేరళను విస్మరించారంటూ ప్రతిపక్షాలు చేసిన ఆరోపణపై కేంద్ర మంత్రి జార్జి కురియన్ ఆదివారం వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. కేంద్రం నుంచి ఎక్కువ నిధులు కావాలంటే కేరళను వెనుకబడిన రాష్ట్రంగా ప్రకటించాలని ఆయన రాష్ట్ర ప్రభుత్వానికి సూచించారు. ఇతర రాష్ట్రాలతో పోలిస్తే వెనుకబడిన రాష్ట్రాలకు కేంద్రం చేయూతనిస్తుందని కేరళకు చెందిన కేంద్ర మంత్రి మీడియాకు తెలిపారు. విద్య, సామాజిక ప్రగతి, మౌలిక సౌకర్యాలలో కేరళ వెనుకబడి ఉందని, కేరళను వెనుకబడిన రాష్ట్రంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రకటిస్తే దీన్ని ఫైనాన్స్ కమిషన్ పరిశీలించి కేంద్ర ప్రభుత్వానికి సిఫార్సు చేస్తుందని ఆయన తెలిపారు. ఇతర రాష్ట్రాలతో పోలిస్తే తమకు రోడ్లు లేవని, విద్య లేదని, సామాజిక అభివృద్ధి లేదని, మౌలిక సౌకర్యాలు లేవని కేరళ ప్రభుత్వం ప్రకటిస్తే కమిషన్ అధ్యయనం చేసి కేంద్రానికి నివేదిస్తుందని కేంద్ర మత్స్య, పశు సంవర్ధక పాడి, మైనారిటీ వ్యవహారాల శాఖ సహాయ మంత్రి జార్జి కురియన్ చెప్పారు.

గిరిజన శాఖను అగ్రవర్ణ నేతలు చేపట్టాలి
కేంద్ర మంత్రి సురేశ్ గోపీ వ్యాఖ్యలు

న్యూఢిల్లీ: గిరిజనులు నిజమైన ప్రగతి సాధించాలంటే గిరిజన వ్యవహారాల మంత్రి పదవిని బ్రాహ్మణులు, నాయుళ్లు వంటి అగ్ర వర్ణాలవారు నిర్వహించాలని కేంద్ర మంత్రి సురేశ్ గోపీ అభిప్రాయపడ్డారు. ఢిల్లీలో బీజేపీ ఎన్నికల ప్రచార సభలో ఆయన చేసిన ఈ వ్యాఖ్యలు పెను దుమారం రేపాయి. గిరిజన సంక్షేమ మంత్రి పదవిని తనకు ఇవ్వాలని ప్రధాని మోదీని తాను కోరానని సురేశ్ గోపీ తెలిపారు. అయితే, మంత్రి పదవులను కేటాయించడంలో కొన్ని దృష్టాంతాలు ఉన్నాయన్నారు. సురేశ్ గోపి వ్యాఖ్యలపై కేరళ సీపీఐ కార్యదర్శి బినోయ్ విశ్వమ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కుల వ్యవస్థను ఆయన సమర్థిస్తున్నారని మండిపడ్డారు. ఆయనను కేంద్ర మంత్రి పదవి నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. విమర్శలు వెల్లువెత్తడంతో సురేశ్ వెనుకకు తగ్గారు. తాను సదుద్దేశంతోనే మాట్లాడానని, ఫలనావారు మంచివారని కానీ, చెడ్డవారని కానీ తాను చెప్పలేదని ఆయన వివరణ ఇచ్చారు.

టారిఫ్ వార్

మొదటిపేజీ తరువాయి...

వచ్చే 155 బిలియన్ డాలర్ల ఉత్పత్తులపై తాము 25 శాతం సుంకాలు విధించినట్టు, వాటిని అమలు చేస్తున్నట్టు ప్రకటించింది. ప్రపంచంలో రెండు పెద్ద ఆర్థిక వ్యవస్థల మధ్య ఏర్పడిన ఉద్రిక్తతల ప్రభావం మిగిలిన దేశాలకు కూడా వ్యాపిస్తుందని ఆర్థిక నిపుణులు హెచ్చరిస్తున్నారు. మరో పెద్ద ఆర్థిక వ్యవస్థ కలిగిన భారత్‌పై సైతం రేపో మాపో ఆంక్షలు విధించే అవకాశముందని వారు తెలిపారు. అమెరికా చర్యపై చైనా డబ్ల్యూటీవోను ఆశ్రయించినా, ప్రతీకార చర్యలకు దిగినా ప్రపంచవ్యాప్తంగా వాణిజ్యపరంగా పలు అంతరాయాలు ఏర్పడతాయని అంటున్నారు. పైగా దీని కారణంగా అమెరికా వృద్ధి తగ్గుతుందని, మిగిలిన దేశాల్లో ఆర్థిక సంక్షోభం ఏర్పడుతుందని అవి హెచ్చరిస్తున్నాయి.

వలసలు, డ్రగ్స్‌కు అడ్డుకట్ట వేసేందుకే..

ఎన్నికల ప్రచారం సందర్భంగా ట్రంప్ తాను చేసిన వాగ్దానాన్ని నిలబెట్టుకున్నారు. అక్రమ వలసదారులు, డ్రగ్స్‌ను అరికట్టడానికే తానీ చర్య తీసుకున్నట్టు తాజాగా ఆయన ట్రూత్ సోషల్ పోస్ట్‌లో వెల్లడించారు. 'మెక్సికో, కెనడా(కెనడియన్ ఎనర్జీపై 10 శాతం) దేశాల దిగుమతులపై 25 శాతం సుంకాలు విధిస్తున్నా. అలాగే చైనా నుంచి అదనంగా 10 శాతం వసూలు చేస్తా. ఇంటర్నేషనల్ ఎమర్జెన్సీ ఎకనమిక్ పవర్స్ చట్టం (ఐఈఈపీఏ) ప్రకారం దీనిని అమలు చేస్తున్నా. ఎందుకంటే అక్రమ వలసదారులు, ప్రమాదకరమైన మాదకద్రవ్యాలు మా పౌరుల ప్రాణాలను తీస్తున్నాయి. అమెరికా అధ్యక్షుడిగా వాటిని అరికట్టి, వారందరి రక్షణ చూడటం నా బాధ్యత. సరిహద్దులు, ఇతర మార్గాల నుంచి వెల్లువలా అమెరికాలోకి వస్తున్న అక్రమ వలసదారులను అడ్డుకుంటానని ఎన్నికల ప్రచారంలోనే హామీ ఇచ్చా. అందుకే అమెరికా పౌరులు అధికులు నాకు ఓటేసి పట్టం కట్టారు' అని ఆయన తన పోస్ట్‌లో పేర్కొన్నారు. ఈ సుంకాలు అమలుచేయడానికి ట్రంప్ ఆర్థిక అత్యవసర స్థితిని ప్రకటించారు. ఈ సుంకాల అమలు మంగళవారం నుంచి ప్రారంభమవుతుందని తెలిపారు.

కెనడా ప్రతీకార చర్యలు

కెనడా దిగుమతులపై ట్రంప్ విధించిన సుంకాలపై కెనడా కూడా తీవ్రంగానే స్పందించింది. '155 బిలియన్ కెనడియన్ డాలర్ల అమెరికా దిగుమతులపై 25 శాతం సుంకాలు విధిస్తున్నాం. వాషింగ్టన్ చర్యలకు ఇది మా ప్రతిస్పందన. ఇందులో 35 బిలియన్ డాలర్ల వస్తువులపై సుంకాలు మంగళవారం నుంచే అమల్లోకి వస్తాయి. మిగిలినవి 21 రోజుల తర్వాత అమలవుతాయి' అని కెనడా ప్రధాని ట్రూడో ప్రకటించారు.

మండిపడ్డ మెక్సికో

తమపై 25 శాతం దిగుమతి సుంకాలు విధించడం పట్ల మెక్సికో మండిపడింది. అమెరికా చర్యకు ప్రతీకార చర్యకు దిగాలని ఆ దేశ అధ్యక్షురాలు క్లాడియా షీన్‌బామ్ పార్డో ఆదేశించారు. అమెరికా వాణిజ్య చర్యలపై తమ వద్ద ప్లాన్ ఏ, ప్లాన్ బీ, ప్లాన్ సీ సహా పలు ప్రణాళికలు సిద్ధంగా ఉన్నాయని చెప్పారు. క్రిమినల్ సంస్థలతో మెక్సికో ప్రభుత్వానికి సంబంధాలు ఉన్నాయని అమెరికా చేస్తున్న ఆరోపణలను ఆమె తీవ్రంగా ఖండించారు. అత్యంత శక్తివంతమైన సింథటిక్ ఓపియాయిడ్ అయిన ఫెంటానిల్ వినియోగంపై మెక్సికో అధ్యక్షురాలు అమెరికా ప్రభుత్వాన్ని తీవ్రంగా విమర్శించారు. గత నాలుగు నెలలుగా తమ దేశంలో 40 టన్నుల డ్రగ్స్‌ను స్వాధీనం చేసుకోగా అందులో 20 మిలియన్‌ల ఫెంటానిల్ డోస్‌లు ఉన్నాయన్నారు. 10 వేల మందిని అరెస్ట్ చేశామని చెప్పారు. అమెరికాకు నిజంగానే ఫెంటానిల్ వినియోగాన్ని అరికట్టాలన్న చిత్తశుద్ధి ఉంటే వారి దేశంలోని వీధుల్లో సైతం అమ్ముతున్న మాదక ద్రవ్యాలను నిరోధించాలని అన్నారు.

చైనా ఆగ్రహం

ట్రంప్ విధించిన సుంకాలపై ఆగ్రహం వ్యక్తం చేసిన చైనా తాము కూడా ప్రతీకార చర్యలకు దిగుతామని ఆ దేశ ఆర్థిక, వాణిజ్య మంత్రిత్వ శాఖ హెచ్చరించింది. ఇది కచ్చితంగా ప్రపంచ వాణిజ్య ఒప్పందాలను ఉల్లంఘించడమేనని, తమ హక్కుల రక్షణ, ప్రయోజనాలను కాపాడుకునేందుకు ఈ సమస్యను వరల్డ్ ట్రేడ్ ఆర్గనైజేషన్ (డబ్ల్యూటీవో) దృష్టికి తీసుకువస్తామని తెలిపింది. అయితే ఈ వాణిజ్య యుద్ధాన్ని ఆపడానికి తామెప్పుడూ సిద్ధమేనని ప్రకటించింది. అమెరికా ఆరోపిస్తున్న విధంగా ఫెంటానిల్ డ్రగ్ సంక్షోభం అమెరికాకు సంబంధించినదని, అది ఆ దేశ సమస్యని పేర్కొంది. సుంకాల పేరుతో బెదిరింపులకు పాల్పడే కన్నా అమెరికా తన తప్పుడు విధానాలను సవరించుకోవాలని చైనా హితవు పలికింది.

సుంకాలు తగ్గించిన భారత్

కెనడా, మెక్సికోతో పాటు భారత్ దిగుమతులపై కూడా సుంకాలు విధిస్తామని ట్రంప్ హెచ్చరించిన క్రమంలో అమెరికా నుంచి దిగుమతయ్యే హైఎండ్ బైక్‌లు, కార్లు, స్మార్ట్‌ఫోన్ విడి భాగాలపై కస్టమ్స్ డ్యూటీని గణనీయంగా తగ్గిస్తున్నట్టు భారత్ శనివారం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ప్రకటించింది. ఈ చర్యతో అమెరికాకు చెందిన హార్లీ-డేవిడ్‌సన్, టెస్లా, ఆపిల్ కంపెనీలకు లబ్ధి చేకూరుతుంది. బైక్‌లు, ఫోన్లపై 10 నుంచి 40 శాతం, టెస్లా కార్లపై 55 శాతం వరకు కస్టమ్స్ డ్యూటీ తగ్గిస్తున్నట్టు మంత్రి సీతారామన్ తెలిపారు.

న్యాక్ రేటింగ్ కోసం లంచాలు

- కేఎల్ యూనివర్సిటీలో తనిఖీలు, యాజమాన్యంపై కేసు నమోదు
- దేశ వ్యాప్తంగా 20 ప్రాంతాల్లో ఏకకాలంలో సీబీఐ విస్తృత సోదాలు
- లంచం ఆరోపణలతో 10 మంది న్యాక్ తనిఖీ బృంద సభ్యుల అరెస్ట్

న్యూఢిల్లీ, విజయవాడ, ఫిబ్రవరి 2: సీబీఐ శనివారం దేశ వ్యాప్తంగా 20 ప్రాంతాల్లో చేసిన సోదాల్లో లంచాల బాగోతం బయట పడటం సంచలనం సృష్టించింది. లంచాల విషయమై అందిన ఫిర్యాదుల మేరకు ఢిల్లీ, విశాఖపట్నం నుంచి వచ్చిన సీబీఐ అధికారులు విజయవాడలోని కేఎల్ యూనివర్సిటీ పరిపాలన భవనం, వడ్డేశ్వరంలోని వర్సిటీ క్యాంపస్‌లో రాత్రి వరకు సోదాలు నిర్వహించారు. వడ్డేశ్వరంలోని కేఎల్ విశ్వవిద్యాలయానికి న్యాక్ నుంచి 'ఎ++' గుర్తింపు పొందేందుకు న్యాక్ బృందానికి వర్సిటీ యాజమాన్యం లంచాలు ఇచ్చినట్టు సీబీఐ ఒక ప్రకటనలో తెలిపింది. దీనిపై కేసు నమోదు చేసి 14 మందిని నిందితులుగా పేర్కొన్నారు. తనిఖీల్లో రూ.37 లక్షల నగదు, 6 ల్యాప్ ట్యాప్‌లు, ఒక ఐ ఫోన్ 16 ప్రోను సీబీఐ స్వాధీనం చేసుకుంది. వీటిని లంచాలుగా ఇచ్చారని సీబీఐ తెలిపింది. ఈ కేసుకు సంబంధించి కోనేరు లక్ష్మయ్య ఎడ్యుకేషనల్ ఫౌండేషన్ యాజమాన్య ప్రతినిధులు ముగ్గురిని సీబీఐ అరెస్ట్ చేసింది. అలాగే లంచాలు స్వీకరించిన న్యాక్ తనిఖీ బృందం చైర్మన్, సభ్యులుగా ఉన్న ప్రముఖ వర్సిటీల ప్రొఫెసర్లను అదుపులోకి తీసుకుంది. మరోవైపు చెన్నై, బెంగళూరు, భోపాల్, బిలాస్‌పూర్, న్యూఢిల్లీ, గౌతమ్ బుద్ధ నగర్ తదితర ప్రాంతాల్లోనూ సీబీఐ తనిఖీలు చేపట్టింది.

అయోధ్యలో దళిత యువతిపై హత్యాచారం

- రేప్ చేసి కిరాతకంగా హత్యచేసిన దుండగులు
- ఘటనపై బోరున విలపించిన ఫైజాబాద్ ఎంపీ
- న్యాయం జరగకపోతే రాజీనామా చేస్తానని వెల్లడి

అయోధ్య: అయోధ్యలో దళిత యువతి దారుణ హత్యకు గురయ్యారు. ఆమెపై లైంగిక దాడికి పాల్పడిన దుండగులు, అనంతరం కిరాతకంగా హత్య చేశారు. ఈ ఘటనపై ఫైజాబాద్ ఎంపీ, సమాజ్‌వాదీ పార్టీ నేత అవధేష్ ప్రసాద్ బోరున విలపించారు. ఆయన ఆదివారం విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ, ఆ యువతి కుటుంబానికి న్యాయం జరగకపోతే తాను తన పదవికి రాజీనామా చేస్తానన్నారు. మృతురాలి కుటుంబ సభ్యుల కథనం ప్రకారం, ఆమె గురువారం రాత్రి భాగవత కథ వినడానికి వెళ్లారు. ఆ మర్నాడు కాలువలో ఆమె మృతదేహం కనిపించింది. వివస్త్రగా ఉన్న ఆమె శరీరంపై గాయాలు ఉన్నాయి. ఎముకలు విరిగిపోయాయి. ఆమె శరీరాన్ని తాళ్లతో కట్టేశారు. కళ్లు పీకేశారు. ఆమె కనిపించకుండాపోయినట్లు వచ్చిన ఫిర్యాదు మేరకు శుక్రవారం కేసు నమోదు చేశామని సర్కిల్ ఆఫీసర్ అశుతోష్ తివారీ చెప్పారు. పోస్ట్‌మార్టం నివేదిక వచ్చిన తర్వాత తదుపరి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ఇస్రో వందో ప్రయోగంలో సాంకేతిక లోపం
కక్ష్యలోకి ప్రవేశించని ఎన్‌వీఎస్-02 శాటిలైట్

న్యూఢిల్లీ: గత బుధవారం ఇస్రో చేపట్టిన 100వ ప్రయోగానికి అనుకోని అడ్డంకులు ఏర్పడ్డాయి. అంతరిక్షంలోకి పంపిన ఎన్‌వీఎస్-02 శాటిలైట్‌లో సాంకేతిక లోపం తలెత్తిందని ఇస్రో తాజాగా ప్రకటించింది. 'నిర్దేశిత కక్ష్యలోకి ఎన్‌వీఎస్-02 నావిగేషన్ శాటిలైట్‌ను ప్రవేశపెట్టలేకపోయాం. కక్ష్యను పెంచేందుకు శాటిలైట్‌లోని థ్రస్టర్లను మండించే ప్రయత్నం చేయగా, ఆక్సిడైజర్లను అందించే వాల్వ్‌లు తెరుచుకోలేదు' అని ఇస్రో వెబ్‌సైట్ పేర్కొన్నది. యూఆర్ శాటిలైట్ సెంటర్‌లో తయారైన శాటిలైట్‌లో సాంకేతిక లోపం కారణంగా ద్రవరూప ఇంధనం మండించలేకపోయారు. దీంతో ఈ మిషన్ ఆలస్యం కావొచ్చు లేదా.. శాటిలైట్‌పై ఆశలు వదులుకోవచ్చునని సైంటిస్టులు భావిస్తున్నారు. జనవరి 29న శ్రీహరి కోట నుంచి జీఎస్ఎల్‌వీ-ఎఫ్15 రాకెట్ ద్వారా ఎన్‌వీఎస్-02 శాటిలైట్‌ను ఇస్రో ప్రయోగించింది.

గ్యారెంటీలతో నిధుల కటకట

- కర్ణాటక ముఖ్యమంత్రి సలహాదారు పదవికి బీఆర్ పాటిల్ రాజీనామా
- నిధుల్లేక నియోజకవర్గానికి ఏమీ చేయలేకపోతున్నానని ఆవేదన
- తనలాగే చాలా మంది ఎమ్మెల్యేలు ఇబ్బంది పడుతున్నారని వెల్లడి

కలబుర్గి: కర్ణాటక సీఎం సిద్ధరామయ్య రాజకీయ సలహాదారు పదవికి అలంద్ కాంగ్రెస్ ఎమ్మెల్యే బీఆర్ పాటిల్ రాజీనామా చేశారు. 2023 డిసెంబర్ 29 నుంచి ఈ పదవిలో ఉన్న ఆయన తన రాజీనామాను సీఎం ఆఫీస్‌కు సమర్పించారు. గ్యారంటీల కారణంగా తన నియోజకవర్గానికి నిధులు రాకపోవడంతో ఈ పదవికి రాజీనామా చేసినట్టు ఆయన చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం నిరుటి బడ్జెట్‌లో ఈ ఐదు గ్యారంటీల అమలుకు 52,000 కోట్లను కేటాయించిందని చెప్పారు. అయితే పార్టీ వర్గాల సమాచారం మేరకు నవంబర్ నాటికే బడ్జెట్‌లో కేటాయించిన దానికన్నా చాలా ఎక్కువ మొత్తం ఖర్చు చేశారన్నారు. నిధుల లేమి కారణంగా తన నియోజకవర్గానికి ఏమీ చేయలేకపోతున్నానని ఆవేదన వ్యక్తం చేశారు. రాజకీయ సలహాదారు పదవి వల్ల ఎలాంటి ఉపయోగం లేదని, అందుకే దానికి రాజీనామా చేసినట్టు చెప్పారు. గ్యారంటీల కారణంగా నిధులు రాకతానే కాదు, చాలామంది ఎమ్మెల్యేలు ఇబ్బంది పడుతున్నారని ఆయన తెలిపారు.

కర్ణాటకలో చివరి మావోయిస్టు లొంగుబాటు

ఉడుపి(కర్ణాటక): కర్ణాటకలో చివరి నక్సలైట్‌గా భావిస్తున్న లక్ష్మి అనే మహిళ ఆదివారం ఉడుపి డీసీపి విద్యా కుమారి, ఎస్‌పీ అరుణ్ కె ఎదుట బేషరతుగా లొంగిపోయారు. ఆంధ్రప్రదేశ్‌లో రహస్య జీవితాన్ని గడుపుతున్న లక్ష్మిపై ఉడుపి జిల్లా కుందాపూర్ తాలుకాలోని అమాసెబేల్, శంకరనారాయణ పోలీస్ స్టేషన్లలో మూడు కేసులు ఉన్నాయని పోలీసులు తెలిపారు. పోలీసులపై కాల్పులు, గ్రామాలు, చిన్న పట్టణాలలో మావోయిస్టు సాహిత్యం పంపిణీకి సంబంధించి ఇవి 2007-2008 నాటి కేసులని వారు చెప్పారు. కుందపురా తాలూకాలోని మచ్చట్టు గ్రామానికి చెందిన లక్ష్మి వెంట ఆమె భర్త, మాజీ నక్సలైట్ సలీం, నక్సల్ లొంగుబాటు కమిటీ సభ్యుడు శ్రీపాల్ ఉన్నారు. 2020లో ఆమె భర్త ఆంధ్రప్రదేశ్‌లో లొంగిపోయారు.

ఐర్లాండ్‌లో కారు ప్రమాదం..
ఇద్దరు తెలుగు విద్యార్థుల దుర్మరణం
తీవ్రంగా గాయపడిన మరో ఇద్దరు యువకులు

లండన్, ఫిబ్రవరి 2: దక్షిణ ఐర్లాండ్‌లో జరిగిన కారు ప్రమాద ఘటనలో 20 ఏండ్ల వయసున్న ఇద్దరు తెలుగు విద్యార్థులు ప్రాణాలు కోల్పోయారు. మరో ఇద్దరు విద్యార్థులు తీవ్రంగా గాయపడ్డారు. ఇక్కడి సౌత్ ఈస్ట్ టెక్నాలజికల్ యూనివర్సిటీలో చదువుకుంటున్న నలుగురు స్నేహితులు ప్రయాణిస్తున్న కారు గత శుక్రవారం ఉదయం ఇక్కడి కార్లో కౌంటీలో చెట్టును ఢీకొన్నది. ఈ ఘటనలో చెరుకూరి సురేశ్ చౌదరి, చిత్తూరి భార్గవ్ అక్కడికక్కడే మరణించారని ఎమర్జెన్సీ సేవల విభాగం మీడియాకు తెలిపింది. గాయపడ్డ ఇద్దరు విద్యార్థులను దవాఖానకు తరలించి వైద్య చికిత్స అందిస్తున్నట్టు పేర్కొన్నది. డబ్లిన్‌లోని భారత ఎంబసీ ప్రమాద ఘటనపై తీవ్ర సంతాపం వ్యక్తం చేసింది. గాయపడ్డ విద్యార్థులకు మెరుగైన చికిత్స అందించేందుకు సహకారమందిస్తున్నట్టు ప్రకటించింది.

దక్షిణాఫ్రికాలో హిందూ ఆలయం ప్రారంభం
దక్షిణార్ధ గోళములో ఇదే అతి పెద్దది

జోహన్నెస్‌బర్గ్: దక్షిణార్ధగోళములో అతి పెద్ద హిందూ ఆలయం, సాంస్కృతిక సముదాయం ఆదివారం దక్షిణాఫ్రికాలోని జోహన్నెస్‌బర్గ్‌లో ప్రారంభమైంది. ఈ సందర్భంగా జరిగిన ఉత్సవంలో పాల్గొనేందుకు వందలాది మంది హిందూ భక్తులు హాజరయ్యారు. దక్షిణాఫ్రికా జనాభాలో హిందువులు కేవలం రెండు శాతం మాత్రమే ఉన్నప్పటికీ దేశంలోని భారతీయ సమాజంలో అత్యధికులు హిందూ మతాన్నే అనుసరిస్తారు. 82 ఏళ్ల ఆధ్యాత్మిక నాయకుడు, బోచసన్వాసి అక్షర్ పురుషోత్తం స్వామినారాయణ్ సంస్థ(బాప్స్)కు చెందిన మహంత్ స్వామి మహారాజ్ నేతృత్వంలో జరిగిన ఆలయ ప్రాణప్రతిష్ట కార్యక్రమంలో పాల్గొనేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో తెల్లవారుజామునే ఆలయానికి చేరుకున్నారు. దక్షిణార్ధగోళములోనే ఈ ఆలయం అతి పెద్ద హిందూ సాంస్కృతిక సముదాయంగా బాప్స్ తన ఫేస్‌బుక్ పేజ్‌లో అభివర్ణించింది.

మే 4న తెరుచుకోనున్న బద్రీనాథ్ ఆలయ ద్వారాలు

న్యూటెహ్రీ, ఫిబ్రవరి 2: ఉత్తరాఖండ్ చమోలి జిల్లాలో గల బద్రీనాథ్ ఆలయ ద్వారాలు మే 4న ఉదయం ఆరు గంటలకు తెరుచుకుంటాయి. బసంత పంచమి సందర్భంగా టెహ్రీలోని నరేంద్ర నగర్ మాజీ రాజ ప్రాంగణంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించిన అనంతరం రాజ పూజారి ఆచార్య కృష్ణ ప్రసాద్ ఉన్నియల్ ఆలయ ద్వారాన్ని తెరిచే తేదీని నిర్ణయించారు. చార్‌ధామ్‌లుగా పేరొందిన బద్రీనాథ్, కేదార్‌నాథ్, గంగోత్రి, యమునోత్రిలను ప్రతి ఏడాది దీపావళి తర్వాత మూసివేసి తిరిగి ఏప్రిల్, మే నెలల్లో తెరుస్తారు. అనంతరం ఈ ఆరు నెలల కాలంలో దేశ విదేశాల నుంచి లక్షలాది మంది భక్తులు ఈ చార్‌ధామ్‌లను దర్శించుకుంటారు.

మహారాష్ట్రలో ఏఐ వర్సిటీ
దేశంలో ఏర్పాటు చేయడం ఇదే ప్రథమం

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 2: దేశంలో తొలి ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) యూనివర్సిటీ మహారాష్ట్రలో ఏర్పాటు కాబోతున్నది. ఈ ప్రాజెక్టు అమలు కోసం వివిధ రంగాల నిపుణులతో ఓ టాస్క్ ఫోర్స్ కమిటీ ఏర్పాటైనట్టు ఆ రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి ఆశిష్ షేలర్ వెల్లడించారు. మహారాష్ట్ర ఐటీ శాఖ ముఖ్య కార్యదర్శి నేతృత్వంలో ఏర్పాటైన ఈ కమిటీలో ఐఐటీ ముంబై, ఐఐఎం ముంబై డైరెక్టర్లు, గూగుల్ ఇండియా, మహీంద్రా గ్రూప్, ఎల్‌అండ్‌టీ లాంటి దిగ్గజ సంస్థల ప్రతినిధులు, కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఐటీ మంత్రిత్వ శాఖ అధికారులు, రాజీవ్ గాంధీ సైన్స్ అండ్ టెక్నాలజీ కమిషన్, డాటా సెక్యూరిటీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా నిపుణులు సభ్యులుగా ఉన్నట్టు తెలిపారు. ఇప్పటికే రెండుసార్లు సమావేశమైన ఈ కమిటీ.. ఏఐ యూనివర్సిటీ ఏర్పాటు కోసం తుది రోడ్ మ్యాప్‌ను రూపొందించేందుకు కసరత్తు చేస్తున్నట్టు వివరించారు.

రుణం తీసుకుని.. సుపారీ ఇచ్చి..
మరదలిపై గ్యాంగ్‌రేప్

మీరట్, ఫిబ్రవరి 2: ఒక వ్యక్తి 40 వేల రుణం తీసుకుని, దానిని ఇద్దరు కిరాయి వ్యక్తులకు సుపారీ ఇచ్చి సొంత మరదలిపై సామూహిక లైంగిక దాడి, హత్య చేయించిన ఘటన యూపీలో చోటుచేసుకుంది. మీరట్‌లోని నాను కెనాల్ వద్ద జనవరి 21న జరిగిన ఈ దారుణానికి సంబంధించి నిందితుడిని అరెస్ట్ చేశారు. ఆశిష్ అనే వ్యక్తి తన భార్య చెల్లెలుతో అక్రమ సంబంధం పెట్టుకున్నాడు. అయితే ఆమె బ్లాక్‌మెయిల్ చేయడం ప్రారంభించడంతో ఆమెను హతమార్చాలని నిర్ణయించుకున్నాడు. 40 వేల రూపాయలు రుణం తీసుకుని హత్య చేయడానికి శుభం, దీపక్‌లతో 30 వేలకు ఒప్పందం కుదుర్చుకున్నాడు. ఇద్దరు నిందితులు ఆమెను అపహరించి సామూహిక లైంగిక దాడి చేసి అనంతరం హత్య చేసి పరారయ్యారు.

భర్త కిడ్నీ అమ